క్లుప్తంగా

రెండు మీడియంలలో బోధన సాగించాలి



• పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

పార్వతీపురం రూరల్: రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ శాసన మండలిలో మాట్లాడుతూ ఏ ఒక్క పాఠశాలను మూసివేసే ప్రసక్తి లేదని వ్యాఖ్యానించడం ఆనందాన్ని ఇచ్చిందని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ అన్నారు. 117 జీఓను రద్దు చేసి దాని స్థానంలో రాబోయే జీఓ అంతకంటే దారుణంగా ఉంటుందని తాము భావిస్తున్నామని, దానివల్ల ఉన్నత పాఠశాలల్లో అనేక పోస్టులు కనుమరుగయ్యే ప్రమాదం వస్తుందన్నారు. ప్రతి శుక్రవారం తాముఇచ్చిన సూచనలు పక్కన పెట్టి అధికారులు వారికి తోచిన విధంగా నిబంధనలు పెట్టడం సరికాదని, దానివల్ల విద్యావ్యవస్థ మెరుగు పడకపోగా తిరోగమనంలో ఉండే దుస్థితి దాపురిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కావాలంటే సంఘం నాయకులు ఎమ్మెల్సీలతో సమావేశం ఏర్పాటు చేసిన తరువాత మాత్రమే అమలు చేయాలని సూర్యనారాయణ పేర్కొన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామికి ముడుపులపూజలు



పత్ర,పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీతీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి వారికి గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ముడుపుల పూజలు ఘనంగా జరిగాయి.ఈ మేరకు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ లోక కల్యాణార్థం వందలాది మందిభక్తులు గురువారం జరుగుతున్న ముడుపుల పూజా కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలియజేశారు. అలాగే జిల్లాలో ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉదయం 5 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆలయ ప్రాంగణంలో క్యూకట్టి ముడుపుల పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవం

పార్వతీపురంటౌన్: ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్ అన్నారు. ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఎన్‌జీఓ హోంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. సమానపనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో వై. తిరుపతి రావు, ఆర్.రమేష్, కె.కిశోర్, ఆర్.శీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

దళారులకు విక్రయించవద్దు



గిరిజన జీడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం సన్నిబాబు

పార్వతీపురం రూరల్: గిరిజన రైతులు తమ ఉత్పత్తులను దళారులకు విక్రయించవద్దని ఏపీఎం సన్నిబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని గంగాపురం పంచాయతీ కోరి, తాన్నవలస గ్రామాల్లో గిరిజన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏర్పాటు చేసిన ఆరు వన్‌ధన్ వికాస కేంద్రాల్లో గిరిజన ఉత్పత్తులైన జీడిపిక్కలు, చింతపండు, తదితర ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. దళారులను ఆశ్రయించి ఉత్పత్తులను విక్రయిస్తే నష్టపోతారని హితవు పలికారు. గిరిజనులంతా వన్‌ధన్ వికాస కేంద్రాల్లో ఉత్పత్తులను విక్రయించి లాభం పొందాలని కోరారు. కార్యక్రమంలో సీసీ అప్పల నాయుడు, వీఓఏ, గిరిజన రైతులు పాల్గొన్నారు.

చలవ కళ్లద్దాలతో కంటికి రక్షణ



• సూచిస్తున్న కంటి వైద్య నిపుణులు



కళ్లజోళ్లు కొనుగోలు చేస్తున్న వాహన చోదకులు

పార్వతీపురం రూరల్:

ఈ సృష్టిలోని అందాలను వీక్షించాలన్నా..వీక్షించిన తరువాత మనస్సులో పదిలపరుచుకోవాలన్నా..దేనినైనా గుర్తించాలన్నా..జీవికి కళ్లు చాలా అవసరం. వేసవిలో శరీరంతో పాటు కళ్లమీద కూడా శ్రద్ధ చూపడం చాలా మంచింది. శరీరానికి వేడి చేయకుండా ఎప్పుడూ చల్లదనంలో ఆరోగ్య స్థితి మెరుగ్గా ఉండాలని జాగ్రత్తలు తీసుకుంటాం. గొంతెండిపోతే గుక్కెడు నీరు గానీ, శీతలపానీయాలు గానీ సేవించి సేదతీరుతాం. కానీ, కళ్ల గురించి అసలు పట్టించుకోం. వేసవిలో సరైన కంటి జాగ్రత్తలు తీసుకోకపోతే అపాయమేనని చెబుతున్నారు నేత్ర వైద్యులు. పిల్లలతో పాటు అత్యవసర సమయంలో ఎండలో తిరిగే పెద్దవారు కూలింగ్ గ్లాసెస్ తప్పనిసరిగా వాడాలని చెబుతున్నారు. చలువ కళ్లజోళ్లు వాడడం వల్ల ఎండవేడిమి నుంచి కళ్లను కాపాడుకోవచ్చని నేత్ర వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

• చూపు కోల్పోయే ప్రమాదం

కళ్లలోని అతి సున్నితమైన భాగాలకు వేడి తగలడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. శరీరంలో కళ్లు ఎంతో సున్నితమైనవి. మిట్టమధ్యాహ్నం లేదా ఎండ వేడి ఎక్కువగా ఉన్న సమయంలో ప్రయాణం చేయడం కంటికి మంచిది కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వాహనం నడిపితే హెల్మెట్ లేదా కళ్లజోడును తప్పనిసరిగా పెట్టుకోవాలి. సన్నని దుమ్ము,ధూళి కంటిలో పడడం వల్ల విపరీతమైన కంటి దురదలు ఏర్పడతాయి. నల్లగుడ్డు చుట్టూ పొరలు రావడం, ఎర్రని చారలు, కంటి వెంట తీగలాంటి స్రావం కారడం జరుగుతుంది. ఇటువంటి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక్కోసారి జీవితాంతం చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.

నలపడం చేయరాదు

మధ్యాహ్నం సమయంలో ఎండ చాలా తీవ్రంగా ఉంటుంది కళ్లకు రక్షణ కవచాలు లేకుండా తిరిగితే మంట పుట్టడంతో పాటు కళ్లు ఎర్రబడతాయి. ఇటువంటి సందర్భాల్లో కళ్లను చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. వెంటనే సమీపంలోని ఉన్న నేత్ర వైద్యులను సంప్రదించాలి. కళ్లను నలపడం చేయరాదు.

• కంటి చూపు మెరుగు కోసం ఆహారం

కంటి చూపు మెరుగుపరుచుకోవడానికి సమతుల ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రధానంగా తీసుకునే ఆహారంలో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్లు, ఎ,సి విటమిన్లు ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా ఆకుకూరలు అధికమొత్తంలో తీసుకోవాలి. ఎందుకంటే ఇవి పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. పాలకూర వంటివి కూడా కంటి ఆరోగ్యానికి చాలా బాగా సహాయపడతాయి. అలాగే ఒమెగా–3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే సాల్మన్ వంటి చేపలు తీసుకోవాలి. ఇవి కంటి చూపు మెరుగు పడేందుకు దోహదపడతాయి.

జాగ్రత్తలు పాటించాలి



వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వెలుగును తట్టుకోలేని స్థితి ఈ కాలానికి ఉంది. జీవన ఉపాధి దృష్ట్యా ఎక్కువగా ఎండ బారిన పడిన వారు వారి విధుల మూలంగా ద్విచక్రవాహనాలపై ప్రయాణించినప్పుడు, రోడ్లపై వెళ్లేటప్పుడు వేసవిలో ఎండ ప్రభావంతో వచ్చిన వెలుతురు, వేడికి కళ్లకు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల వాళ్ల కళ్లలోని రక్షణ పొర కరిగిపోయి, వారి కళ్లు ఫొటో సెన్సిటివిటీకి గురవుతాయి. దాంతో కళ్లు మరింత సున్నితమైపోయి, క్రమేపీ వెలుగును చూడలేని స్థితికి చేరుకుంటాయి. ఈ సమస్యను సరిచేయడం అసాధ్యం. ఇలాంటివారు బయటకు వెళ్లినప్పుడల్లా చలువ కళ్లద్దాలను ధరిస్తూ జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ యాళ్ల వివేక్, ప్రముఖ కంటి వైద్యుడు

అత్యం మైనింగ్ కంపెనీ అరాచకాలు ఆపాలి



ఐటీడీఏ పీఓ, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పార్వతీపురంటౌన్: అత్యం మైనింగ్ కంపెనీ అరాచకాలు వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట జీవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలియజేశారు. అనంతరం ఐటీడీఏ పీఓ, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవకు వినతిపత్రం అందజేశారు. అత్యం మైనింగ్ ప్రైవేట్ కంపెనీ చర్యల పట్ల చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారన్నారు. పలుమార్లు అధికారులు వచ్చి మైనింగ్ చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారని, ఈ మైనింగ్ వల్ల గ్రామాల్లో ఎన్నో సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. గ్రామాల్లో పెద్దపెద్ద భారీ వాహనాలతో రవాణా చేస్తుండడంవల్ల ధూళి, దుమ్ము, శబ్దకాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ క్రమంలో గ్రామాల మీదుగా వస్తున్న భారీ వాహనాలను గ్రామస్తులు మూకుమ్మడిగా అడ్డుకోగా పోలీసులు పెద్ద ఎత్తున గ్రామాల్లోకి వచ్చి లారీలను అడ్డుకున్న వారిని భయపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమాయక రైతులపై కేసులు నమోదు చేస్తున్నారని ఇదెంతవరకు న్యాయమని ప్రశ్నించారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి అత్యం మైనింగ్ ఆగడాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జి.సూరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

15లోగా పీ4 సర్వే శతశాతం పూర్తి కావాలి



ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూప రాణి

మక్కువ: ఈనెల 15వ తేదీలోగా పీ4 సర్వే శతశాతం పూర్తి చేయాలని ఎంపీడీవో డీడీ స్వరూపరాణి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మక్కువ మండలంలో తూరుమామిడి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులుతో నిర్మించిన మినీ గోశాల, ఇంకుడు గుంతల నిర్మాణాలను ఎంపీడీవో గురువారం పరిశీలించారు. గోశాల, ఇంకుడు గుంతల నిర్మాణాలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి పీ4 సర్వే ఏ మేరకు జరిపించారో పరిశీలించారు. సచివాలయం పరిధిలో ఇంతవరకు 54శాతం మాత్రమే సర్వే జరిపించడంతో, ఎంపీడీవో అసంతృప్తి వెలిబుచ్చారు. ఈనెల 15వ తేదీలోగా సర్వే శతశాతం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తూరుమామిడి సర్పంచ్ రెడ్డి కృష్ణంనాయుడు, సాంకేతిక సహాయకుడు శ్రీకాంత్, క్షేత్ర సహాయకులు పోల్గొన్నారు.

ఏఎన్‌ఎం నియామకాలు ఎప్పుడు?



సమావేశంలో మాట్లాడుతున్న పాలక రంజిత్ కుమార్

పార్వతీపురం: ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థులు అనారోగ్యానికి గురై మరణాలు సంభవిస్తున్నప్పటికీ ఏఎన్ఎంల నియామకాలపై మొదటి సంతకం పెడతామని ప్రకటించిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖామంత్రి ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం 'ఆదివాసీ ఆరోగ్యం' సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో గిరిజన విద్యార్థులకు వైద్యసేవలు అందించిన ఆదివాసీ ఆరోగ్యసిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు సిబ్బంది అవసరమన్నారు. ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది నిలుపుదల అనంతరం గిరిజన విద్యార్థుల మరణాలు పెరిగాయని అన్నారు. సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పి.సురేష్, టి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు



రైతు సేవాకేంద్రంలో ఎరువును పరిశీలిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో రబీ వరిపంటలు సాగు చేస్తున్న రైతులకు రైతుసేవాకేంద్రంలో యూరియా అందుబాటులో ఉందని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని బూర్జ, సీతానగరం,మరిపివలస ఎరువులవిక్రయ కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బూర్జ వ్యవసాయ రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతూ రబీ పంటలు సాగు చేస్తున్న రైతులు యూరియా కొరత ఉందని తనదృష్టికి తేవడం వల్ల గోదాములను పరిశీలించామని తెలిపారు. బూర్జ రైతు సేవాకేంద్రంలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందన్నారు. మిగతా ఎరువులు రబీపంటలకు అవసరమైనవన్నీ అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

• ఎంపీడీఓ జీవీ రమణమూర్తి

పార్వతీపురం రూరల్: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఎంపీడీఓ జీవీ రమణ మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని వెంకంపేట, చినబొండపల్లి, పెదబొండపల్లి, పుట్టూరు గ్రామాల్లో పర్యటించిన ఆయన విక్రయదారులు, ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం ఆవశ్యకతపై కలెక్టర్ ఆదేశాల మేరకు అవగాహన కల్పించారు. అలాగే పీ–4 సర్వే సరళిని గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్లాస్టిక్ వాడకాన్ని క్రమేణా అమలు చేయాలని కోరారు. ప్లాస్టిక్ బదులుగా కాటన్ సంచులను ఉపయోగించాలని సూచించారు. అలాగే పీ–4 సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హద్దులు మీరి ప్రవర్తించవద్దు

• ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: హోలీ పండగ సందర్భంగా హద్దుమీరి ప్రవర్తించకుండా ఐక్యతతో ఆనందంగా మతసామరస్యానికి ప్రతీకగా పండగ జరుపుకోవాలని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. కులమతాలు, ప్రాంతాలు అనే భేదాభిప్రాయాలు లేకుండా జరుపుకునే పండుగల్లో హోలీ పండగ ఒకటన్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ ఒకటేనన్న భావనతో రంగులు హద్దుకుని ఆనందంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో హోలీ పండగను జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. రోడ్ల మీద వెళ్లే వారిపై, ఇతరులపై బలవంతంగా రంగులు చల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా..హోలీ పండగ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను కని పెట్టుకుని ఉండాలని, ముఖ్యంగా ఆడపిల్లలు, మహిళల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా

పాచిపెంట: మండలంలో పి.కోనవలస ఘాట్ రోడ్డు వద్ద ఓ లారీ బోల్తా పడింది. గురువారం ఒడిశా నుంచి ఏపీకి గోధుముల లోడుతో వస్తున్న లారీ ఘాట్‌రోడ్డులో అదుపుతప్పి లోయలో పడిపోయింది. ప్రమాదాన్ని ముందే గ్రహించిన డ్రైవర్, క్లీనర్‌లు కిందికి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డారు. లారీ బోల్తా పడడంతో క్రేన్ల ద్వారా బయటకు తీశారు. కాగా క్రేన్ రోడ్డుకు అడ్డంగా నిలబడడంతో ఆంధ్ర నుంచి ఒడిశాకు వెళ్తున్న వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సాలూరులోనే కార్మికులకు జీతాల్లేవు



సమ్మె చేస్తున్న కార్మికులు

సాలూరు: ఉమ్మడి విజయనగరం జిల్లాలో మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించని దుస్థితి ఒక్క సాలూరు మున్సిపాలిటీలోనే ఉందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ అధ్యక్షుడు రాముడు, శంకర్‌లు అన్నారు. సాలూరు మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె నాలుగవ రోజుకు చేరిన నేపథ్యంలో సమ్మెను ఉద్దేశించి వారు మాట్లాడారు. మున్సిపాలిటీలో కార్మికులకు జీతాలు, పనిముట్లు, సబ్బులు, చెప్పులు, నూనె లేవని విమర్శించారు. కార్మికులతో పనిచేయించుకుంటున్నప్పుడు, వారి కష్టసుఖాలను చూడాల్సిన పాలకవవర్గం, అధికారులు, మంత్రి సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు.కార్మిక సమస్యలు పరిష్కరించేందుకు పాలకవర్గం సమావేశం నిర్వహించాలని, వారికి అందివ్వాల్సిన బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని అంతవరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికారులు స్పందించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పోలరాజు, తవుడు, రాజు, వెంకన్న, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

దృష్టిలోపాలను సరిచూసుకోవాలి

• కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



నేత్ర పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: జిల్లాలోని ప్రతి ఒక్కరూ తమ దృష్టిలోపాల పరీక్షలు నిర్వహించుకుని వాటిని సరిచేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా ఆస్పత్రి సిబ్బంది ఓ ప్రైవేట్ కల్యాణ మంటపంలో ఉచిత కంటి పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన శిబిరంలో కలెక్టర్ కంటి పరీక్షలను చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృష్టి లోపాలు గల వారంతా తమ లోపాలను సరిచేసుకునేందుకు ఇదొక సదవకాశమన్నారు. దృష్టి లోపాలున్న వారికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, ఉచిత పరీక్షలను చేయించడంతోపాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహించి కంటి అద్దాలను అందిస్తుందని చెప్పారు. ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై తమ కంటి పరీక్షలను నిర్వహించుకుని లోపాలను సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల సందర్శన



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: ప్రశాంతకరమైన వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగే విధంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మాధవ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు జరుగుతున్న కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. చుట్టూ ఉన్న పరిసరాలను, తీసుకున్న భద్రతా చర్యలు, పరీక్ష జరుగుతున్న తీరును ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రశాంతకరమైన వాతావరణంలో విమర్శలకు తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించడానికి పోలీసుపరంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఉండకూడదని సూచించారు. తగిన ఎస్కార్ట్‌తో ప్రశ్నపత్రాల తరలింపు, సమాధానాలు డిపాజిట్ చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించే విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందిని తరచూ తనిఖీ చేసి మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఏజెన్సీ గ్రామాల సమస్య పరిష్కారానికి మద్దతివ్వండి



మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరకు వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజనులు

• మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరను కోరిన జగ్గుదొరవలస గ్రామస్తులు

సాలూరు: ఏజెన్సీ గ్రామాల సమస్య పరిష్కారానికి మద్దతు ఇవ్వాలని మండలంలోని జగ్గుదొరవలస గిరిజనులు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను కోరారు. ఈ మేరకు గురువారం వారు రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏజెన్సీ గ్రామాల సమస్య పరిష్కారం కోసం గతంలో సుదీర్ఘంగా తాము గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేశామని గుర్తుచేశారు. ఆ సమయంలో నాటి టీడీపీ మాజీ ఎమ్మెల్సీ, నేటి మంత్రి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీభంజ్‌దేవ్‌లు వచ్చి మద్దతు తెలిపారని, తాము అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నేడు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు పదినెలలు అవుతున్నా నేటికీ ఏజెన్సీ గ్రామాల సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. మీరు చొరవ చూపాలని, గిరిజనుల ఏజెన్సీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. దీనిపై రాజన్నదొర మాట్లాడుతూ, ఏజెన్సీ గ్రామాలకు సంబంధించిన ఫైల్ గత ప్రభుత్వ హయాంలోనే సిద్ధమైందని వివరించారు.ఏజెన్సీ గ్రామాల సమస్యపరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జగ్గుదొరవలసలో జరగనున్న సమాధాన స్వస్థత సువార్త పండుగలకు రాజన్నదొరకు గ్రామస్తులు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు ,ప్రజాప్రతినిధులు, నాయకులు మర్రి ఆదయ్య, మెల్లిక భీమా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న చినభోగిలి యువకులు

సీతానగరం: ప్రతి ఒక్కరూ రక్తదానంచేసి రోడ్డు ప్రమాదాల్లో రక్తస్రావంతో ప్రాణాపాయంలో ఉన్న క్షతగాత్రులను రక్షించండని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జిల్లావైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎంపీడీఓ పి త్రివిక్రమరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ త్రివిక్రమరావు ,స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి పి.ఉష మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, గర్భిణుల ప్రసవ సమయాల్లో రక్తం కోల్పోయి ప్రాణాపాయంలో ఉంటారన్నారు. ఇక్కడ నిర్వహించిన రక్తనిధి వైద్యశిబిరంలో 11 మంది రక్తదానం చేశారని తెలియజేశారు. శిబిరంలో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రి రక్తనిధి డాక్టర్ రాజు, పెదంకలాం డాక్టర్ పెద్దింటి సంధ్య, పావని, ఎంపీహెచ్ఈఓ జి సూర్యనారాయణ సీహెచ్ఓ ఎస్‌పీ రమణ, సీతానగరం, పెదంకలాం పీహెచ్‌సీల వైద్యసిబ్బంది, మండలపరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, సిబ్బంది పలుగ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



పీఓకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు, గిరిజన రైతులు

పార్వతీపురం: ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన జీడి పంట రైతులను ఆదుకోవాలని కోరుతూ ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవకు సీపీఎం జిల్లా కార్యదర్శి కె.సాంబమూర్తి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు హెచ్ రామారావులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొమరాడ మండలంలోని కొత్తవలస గ్రామంలో గత శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు పువ్వుల లలిత, కొండగొర్రి వరహాలమ్మ, పాలక కళావతి, కొండగొర్రి నారాయణమ్మలకు చెందిన ఆరు ఎకరాల్లో జీడి తోటలు కాలి బూడిదయ్యాయని, పంట చేతికొచ్చే సమయంలో ఈ విధంగా జరగడంతో గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోయారని, వీరిని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.